క్లుప్తంగా

తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలి

రౌతులపూడి: తప్పులు లేని ఓటరు జాబితాలను రూపొందించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ బి.భీమారావు ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటు నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులు వంటి పలు అంశాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరిని ఓటర్లగా నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియపై ఎలాంటి అలసత్వం వహించరాదని బూత్ స్థాయి అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ పీవీవీ సత్యనారాయణ, వీఆర్‌ఓలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఏలేశ్వరం: ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎంపీడీఓ ప్రేమ్ సాగర్ అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో బుధవారం ఆయన పర్యటించారు. ఎంపీపీ పాఠశాలలో నిర్మిస్తున్న ఇంకుడుగుంతతో పాటు పలు నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్ ఎంపీడీఓకు వివరించారు. జగనన్న కాలనీలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం, గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏఓ జోకా అమృత

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల ఏఓ జోకా అమృత ఆధ్వర్యంలో కాకినాడ పౌర సరఫరాల శాఖ అధికారులు రైతుల నుంచి ధాన్యం సేకరణ, కనీస నాణ్యతా ప్రమాణాలను గుర్తించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ జోకా అమృత మాట్లాడుతూ రైతులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతుల అవసరాల మేరకు వాహనాలు, సంచులు సిద్ధం చేశామన్నారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ మాధవరావు, సివిల్ సప్లయి ఏఎంటీ విజయరాజు, గోవింద్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ


తునిలో మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న శ్రీనివాస్, సమత

తుని: ప్రధాన మంత్రి ఉజ్వల యోజనలో భాగంగా అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నట్టు హెచ్‌పీసీఎల్ సేల్స్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. తుని సమతా గ్యాస్ ఏజెన్సీలో బుధవారం మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. అర్హత ఉన్న అందరూ దరఖాస్తు చేసుకోవాలని డిస్ట్రిబ్యూటర్ సమత కోరారు. ఉజ్వల యోజన లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను రాయితీపై సరఫరా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాయి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


శంఖవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శంఖవరం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. శంఖవరంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తి ఆధారంగా పురుగు మందుల వాడాలన్నారు. ప్రస్తుతం వరి పంటను మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సహజసిద్ధ ఎరువులతో చీడపీడల నివారణ చేపట్టాలన్నారు. అనంతరం రైతులతో బృంద విన్యాసం చేయించి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం

- తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్
- గోకవరంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్ చిత్రంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: పల్లెలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. గోకవరం శివారున గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో బుధవారం మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల వద్ద నుంచి 108 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా, మండల స్థాయి అధికారులు సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాను సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని జిల్లాలో ఇప్పటి వరకూ పది మండలాల్లో నిర్వహించామన్నారు. స్థానిక సమస్యలను సచివాలయాల పరిధిలోనే పరిష్కరించామన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుని పథకాల ప్రయోజనాలను పొందాలన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, గడపగడపకూ మన ప్రభుత్వం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, డీఆర్వో జి.నరసింహులు, పర్యాటక శాఖ జేడీ వి.స్వామినాయుడు, డిప్యూటీ కలెక్టర్ రామ్‌నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఓ డాక్టర ఎం.సనత్‌కుమారి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.మాధవరావు, డ్వామా పీడీ పి.జగదాంబ, డీఎస్‌ఓ ఎస్.అబ్రహాం, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ వి.నాగార్జునరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


ప్రతిపాడులో సీఎం జగన్, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసిన జర్నలిస్టులు

ప్రత్తిపాడు: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ పత్తిపాడులో జర్నలిస్టులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తొలుత ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ధర్మవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కలిసి వినతపత్రం అందజేశారు. ఎమ్మెల్యే పర్వతను పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు విధివిధానాలు రూపొందిస్తున్నారని తెలిపారు. త్వరలోనే జరలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్లస్థలాలు అందిస్తుందని చెప్పారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

10 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు



సోమవరం జెడ్పీ హైస్కూల్‌లో చెకుముకి సంబరాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కిర్లంపూడి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జిల్లా జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎస్.కన్నబాబు తెలిపారు. మండలంలోని సోమవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం చెకుముకి సైన్స్ సంబరాల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గత మేథోశక్తిని వెలికి తీసేందుకు ఆంధ్రప్రదేశ్ జన విజ్ఞాన వేదిక ఏటా చెకుముకి సంబరాలు నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా కిర్లంపూడి, ఏలేశ్వరం మండలాలకు చెందిన 31 ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే చెకుముకి పోటీలకు సుమారు 3798 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

సత్యదీక్ష స్వాములతో రత్నగిరి కళకళ


సత్యదీక్ష చేపట్టిన భక్తులతో ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: సత్యదీక్ష చేపట్టిన స్వాములతో రత్నగిరి కళకళ లాడుతోంది. ఏటా దేవస్థానం సిబ్బందిలో పది శాతం మంది మాత్రమే సత్యదీక్షలు ఆచరించేవారు. ఈ ఏడాది సిబ్బంది అందరూ దీక్ష తీసుకోవాలని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలివ్వడంతో దాదాపు 80 శాతం మంది సిబ్బంది సత్యదీక్షలు స్వీకరించారు. ఏటా ఆశ్వీయుజ మాసంలో వచ్చే సత్యదేవుని జన్మనక్షత్రం రోజున సత్యదీక్షలు ప్రారంభమై కార్తికమాసంలో వచ్చే సత్యదేవుని జన్మనక్షత్రం మఖ నాడు ముగియనున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మంగళవారం సత్యదీక్షలు ప్రారంభం కాగా వేలాది మంది భక్తులు ఈ దీక్షలు చేపట్టారు. మంగళవారం దీక్ష తీసుకోవడాన్ని సెంటిమెంట్‌గా భావించిన కొంతమంది బుధవారం దీక్ష చేపట్టారు. దీంతో రెండు రోజులుగా దేవస్థానంలో సత్యదీక్ష స్వాముల సందడి నెలకొంది.

విస్తృత ప్రచారం

సత్యదీక్షలను దేవస్థానం సిబ్బంది చేపట్టడం ద్వారా సత్యదీక్షలకు విస్తృత ప్రచారం కల్పించినట్టు అవుతుందని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. విజయవాడ దుర్గమ్మ భవాని మాల, సత్యదీక్షలు ఇంచుమించు ఒకే ఏడాదిలో అంటే 1994లో ప్రారంభమయ్యాయన్నారు. అప్పటి నుంచి విస్తృత ప్రచారంతో ఏటా లక్షలాది మంది భవానీ వేస్తున్నారని, ప్రచారం లేకపోవడంతో సత్యదీక్షలు తక్కువ మంది స్వీకరిస్తున్నారని తెలిపారు. సత్యదీక్షలపై ప్రచారంలో భాగంగా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మినహా మిగిలిన దేవస్థానం సిబ్బందికి తప్పక దీక్షలు స్వీకరించాలని ఆదేశించారు. దీక్ష స్వీకరించని సిబ్బంది సైతం మెడలో పసుపు రంగు కండువాలు ధరించి విధులకు హాజరవ్వాలని ఆదేశించారు. సిబ్బంది కారణం లేకుండా దీక్ష స్వీకరించకపోతే వారిని సస్పెండ్ చేస్తామని ఈఓ హెచ్చరించారు.

సత్యదేవుని దర్శించిన బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్


సత్యదేవుని సన్నిధిలో బ్రాహ్మణ కార్పొరేషన్ నూతన చైర్మన్ కామేశ్వరరావు

అన్నవరం: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన పేర్ని కామేశ్వరరావు బుధవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. వ్రతపురోహిత సంఘం నాయకుడు నాగాభట్ల రవిశర్మ ఆధ్వర్యంలో పురోహితులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదాశీస్సులు సత్యదేవుని చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీ పేట తన స్వస్థలమన్నారు. ఈ నెల 10న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట వేద పండితులు యనమండ్ర శర్మ, వ్రత పురోహిత సూపర్‌వైజర్ మంధా రాంబాబు, అల్లంరాజు శ్రీనివాస్, పెండ్యాల రాము తదితరులు ఉన్నారు.

విభజన హామీలను అమలు చేయాలి



ప్రత్తిపాడులో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తుని: కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.రాము డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని తెలిపారు. విభజన హామీల అమలు కోసం అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అనంతరం తునిలో ఎస్ఎఫ్ఐ నాయకులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, అమ్ము, కుమార్ రాజు, దుర్గా ప్రసాద్, లోవరాజు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ఏలేశ్వరం: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు నిరసన ఎస్ఎఫ్ఐ బుధవారం పాఠశాలల బంద్‌కు పిలుపు నిచ్చింది. ఈ మేరకు ఏలేశ్వరం పట్టణం, మండల పరిధిలో విద్యాసంస్థలు మూతపడ్డాయి. విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్రం తీరు మారకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు మూసివేయించారు. అనంతర గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రొంగల ఈశ్వరరావు, నరసింహమూర్తి, శ్రీరాం, వినయ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ దీపావళిపై అవగాహన ర్యాలీ


తునిలో స్వచ్ఛ దీపావళిపై ర్యాలీ చేస్తున్న అధికారులు

తుని: దీపావళి పండగను ప్రజలు స్వచ్ఛంగా, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. ప్రజారోగ్య శాఖ అధికారులు బుధవారం పట్టణంలో స్వచ్ఛ దీపావళిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీపావళి రోజును శబ్దం, కాలుష్య రహిత టపాసులు కాల్చాలన్నారు. మార్కెట్‌లోని ప్రజలకు దీపావళి పండగపై అవగాహన కల్పించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలి


ఏలేశ్వరంలో రిటైర్డ్ శాస్త్రవేత్త శివప్రసాద్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఏలేశ్వరం: విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ రిటైర్డ్ శాస్త్రవేత్త యళ్ల శివప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ డి.సునీత అధ్యక్షతన రాకెట్ సైన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచం సైన్స్‌పైనే ఆధారపడి ఉందన్నారు. అనంతరం చంద్రయాన్-1,2,3, ఆదిత్య ఎల్ 1, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్లు, ప్రయోగాలను మోడల్స్ ద్వారా వివరించారు. అనంతరం ఆయనను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిన్నారావు, ప్రగడ ప్రయాగమూర్తి, రామారావు, సురేష్, వీరభద్రరావు, మదీన, లక్ష్మి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతకు పెద్దపీట

కోటనందూరు: ధాన్యం కొనుగోలులో పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ అన్నారు. కాకరాపల్లిలో బుధవారం రైతు భరోసా కేంద్రాలకు ధాన్యాన్ని తరలించే వాహనాలకు జీపీఎస్ నమోదు కార్యక్రమాన్ని ఎంపీడీఓ సుబ్రహ్మణశర్మ, తహసీల్దార్ కుశరాజు, ఏఓ కేజే చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తరలించే ప్రతి వాహనాన్ని జీపీఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. జీపీఎస్ లేని వాహనాలతో ధాన్యం తరలించే అవకాశం లేదన్నారు. రైతులు విషయాన్ని గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కేవీ శివకుమారి, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


రామవరంలో బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: మండలంలోని రామవరంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రామవరం ఎస్సీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వంగలపూడి బుల్లమ్మకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.90 వేల ఆస్తినష్టం కలిగినట్లు అగ్నిమాపక అధికారి లక్ష్మణరావు తెలిపారు. కాగా బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బుల్లెమ్మను ఓదార్చి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, ఉచిత గృహ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బుల్లెమ్మకు 50 కేజీల బియ్యంతో పాటు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నేత వత్సవాయి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

446 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ


తేటగుంటలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాంబాబురాజు

తుని రూరల్: మండలంలోని తేటగుంట పంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు పెద్ద పండగ రెండు నెలలు ముందే వచ్చింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను బుధవారం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. భూసేకరణలో జాప్యం, ఇతరేతర కారణాలతో పంచాయతీ పరిధిలో తేటగుంట, టి.వెంకటాపురం, గవరపేట గ్రామస్తులకు ఇళ్లస్థలాలు పంపిణీ ఇప్పటి వరకూ జరగలేదు. భూసేకరణలో జరుగుతున్న జాప్యాన్ని ఇటీవల రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కలెక్టర్ పోలవరం ఎడమ కాలువకు సేకరించిన భూమిని ఇళ్లస్థలాలకు కేటాయించారు. దీంతో మూడు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆయా సమీప ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గత నెలలో మంత్రి దాడిశెట్టి రాజా లాంఛనంగా పట్టాల పంపిణీ చేయగా ఈ రోజు పూర్తి స్థాయిలో 446 మంది అర్హులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. దీంతో టి.వెంకటాపురం, గడరపేట, తేటగుంట గ్రామాల్లోని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థాన ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పేరూరి బద్రినారాయణ, సర్పంచ్ అత్తి నాగరాజు, ఉప సర్పంచ్ పోతుల పెద కాపు, నాయకులు గణేషుల వీరబాబు, వీఆర్వో వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు


గోకవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

గోకవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. గోకవరం శివారులో లబ్ధిదారులకు కేటాయించేందుకు అనువైన స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇంటి స్థలం కోసం అర్జీ పెట్టుకున్న వారికి 90 రోజుల్లోనే స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోకవరానికి చెందిన లబ్ధిదారులకు 20 ఎకరాల స్థలం అవసరం కాగా ఆ మేరకు స్థానికంగా గుర్తించిన స్థలాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా పెన్షనర్ల సంఘ ప్రతినిధులు

కోటనందూరు: పెన్షనర్ల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా నూతన కార్యవర్గ సభ్యులు పని చేయాలని పెన్షనర్ల సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎంవీబీ స్వామి సూచించారు. విశ్రాంత మండల విద్యాశాఖాధికారి లెక్కల స్వామినాయుడు ఆధ్వర్యంలో బుధవారం నూతన పెన్షనర్ల సంఘాన్ని ఏర్పాటు చేశారు. కోటనందూరు మండల పెన్షనర్ల సంఘ నూతన అధ్యక్షుడిగా మామిడి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కొక్కొర్లపాటి సత్యనారాయణరాజు, కార్యదర్శిగా పసగడుగుల వెంకటరమణమూర్తి, జాయింట్ సెక్రటరీగా ఒంటెద్దు రామలింగం, కోశాధికారిగా గాడి రామమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సుర్ల స్వామినాయుడు, లెక్కల స్వామినాయుడు, గొంప యర్రయ్యమ్మ, పసగడుగుల నాగేశ్వరరావు, కూళ్ల దేవుడు, చింతకాయల సత్యనారాయణ ఎన్నికయ్యారు. నూతన కార్యకర్గ సభ్యులతో జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్ఎం రామారావు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గాన్ని సంఘ తుని శాఖ అధ్యక్షుడు మాధవరావు తదితరులు అభినందించారు.

రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి


పీఈ చిన్నాయపాలెంలో రీసర్వేపై సిబ్బందిని ఆరా తీస్తున్న ఆర్డీఓ సీతారామారావు

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు అధికారులను ఆదేశించారు. మండలంలోని శృంగవృక్షం, పీఈ చిన్నాయపాలెం, వేమవరం, తొండంగి తదితర గ్రామాల్లో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం తొండంగి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యంతో కలిసి వీఆర్వోలు, మండల, గ్రామ సర్వేయర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. పారదర్శకంగా భూముల రీసర్వే చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

గోకవరం: జగ్గంపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం చేపడుతున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు బుధవారం తెలిపారు. గోకవరంలో ఉదయం 9 గంటలకు, జగ్గంపేట మండలం మల్లిసాలలో మధ్యాహ్నం 1 గంటకు, గండేపల్లి మండలం ఉప్పలపాడు, కిర్లంపూడి మండలం జగపతినగరంలో సాయంత్రం 3 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామన్ బుధవారం తెలిపారు. గ్రామాల్లో ఈ నెల 23 వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గురువారం ఉప్పలపాడు, 10న తాళ్లూరు-2, 14న తాళ్లూరు-1, 15న సింగరంపాలెం, 16న గండేపల్లి-1, 17న గండేపల్లి-2, 20న మల్లేపల్లి-1, 21న మల్లేపల్లి-2, 22న మురారి-1, 23న మురారి-2 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

ప్రత్తిపాడు: మండలంలో గురువారం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, పార్టీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు బుధవారం తెలిపారు. ఈ నెల 9న చినశంకర్లపూడి, 10న చింతలూరు, 14న బురదకోట, 15న బవురువాక, 16న గజ్జనపూడి, 17న గోకవరం, 20న ప్రత్తిపాడు, 21న పెద్దిపాలెం, 22న పెదశంకర్లపూడి, 23న లంపకలోవ గ్రామాల్లో నిర్వహిస్తామని వివరించారు.

రూ.400 కోట్ల విలువైన ధాన్యం సేకరణే లక్ష్యం

జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

గోకవరం: తూర్పుగోదావరి జిల్లాలో 141 రైస్ మిల్లుల ద్వారా రూ.400 కోట్లు విలువైన ధాన్యం సేకరణ చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఒక్క రైతుకు కూడా ఎటువంటి నష్టం వాటిల్లకుండా మార్గదర్శకాలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం సేకరించాలని అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి మైత్రీ కమిటీ సభ్యులతో ధాన్యం సేకరణపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఉన్న విధానానికి ప్రస్తుత విధానానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన 21 రోజుల్లో వారి బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేస్తున్నామన్నారు. ప్రస్తుత ధాన్యం కొనుగోలు విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండల, ఆర్బీకే స్థాయిలో రైతులకు, మిల్లర్లకు ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా జిల్లాలో మైత్రీ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తేమ శాతాన్ని గుర్తించాలన్నారు. ప్రతి మండలానికి ధాన్యం రవాణాకు సంబంధించి పది వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ డివైజర్లను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా వాటి నివృతి కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని 83094 87151, 0883 2940788 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. సమావేశంలో మడల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ పి.జగదాంబ, డీఎస్‌ఓ పి.భాస్కర్, డిప్యూటీ కలెక్టర్ రామ్‌నాయక్ పాల్గొన్నారు.